క్లుప్తంగా

నేడు మహాజన సభలు

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని విశాల సహకార సంఘం ప్రత్యేక మహాజన సభ సమావేశాన్ని బుధవారం స్థానిక రైతు వేదికలో నిర్వహించనున్నట్లు బ్యాంక్ సీఈఓ తిరుపతి, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి, సహకార సంఘం అధికారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుభరోసా పథకంపై చర్చ, సభ్యుల అభిప్రాయాలు, సలహాలు స్వీకరించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశానికి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం ఉదయం 10గంటలకు మహాజనసభ నిర్వహించనున్నట్లు సీఈఓ రాజమోహన్ ప్రకటనలో తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హాజరు కానున్నట్లు తెలిపారు. రైతు భరోసా పథకంపై పాలకవర్గ సభ్యులు, రైతుల అభిప్రాయాలను స్వీకరించనున్నట్లు తెలిపారు.

మహిళపై కేసు నమోదు



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న స్థావరంపై దాడులు నిర్వహించినట్లు పరకాల ఎక్సైజ్ సీఐ తాతారావు తెలిపారు. నాటుసారా విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన కోగిల లత ఇంట్లో మంగళవారం సోదాలు చేయగా 10లీటర్ల నాటుసారా లభ్యం అయినట్లు తెలిపారు. సాటుసారును స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్టు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. హెడ్‌కానిస్టేబల్ లక్ష్మణాచారి, కానిస్టేబుళ్లు రవీందర్, అఖిల్, కుమార్, దిలీప్ ఉన్నారు.

విద్యార్థికి ఏసీపీ చేయూత



పరకాల : పట్టణానికి చెందిన ఓ నిరుపేద విద్యార్థికి పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ చేయూతనిచ్చారు. రూ.15వేలు ఆర్థికసాయం అందించారు. వృత్తి ధర్మంతో పాటు సామాజిక సేవే లక్ష్యంగా అమ్మ, నాన్న చారిటబుల్ ట్రస్ట్‌ను నెలకొల్పిన ఏసీపీ కిశోర్‌కుమార్ మానవతదృక్పథంతో తమ కుమారుడి చదువు కోసం ఆర్థిక సాయం అందించినందుకు విద్యార్థి తల్లి భవాని ఏసీపీకి కృతజ్ఞలు తెలిపారు.

హనుమాన్‌కు ఘనంగా చందనాభిషేకం



శాయంపేట : మండల కేంద్రంలోని మచ్చర్లయ్యగుట్ట వద్ద వెలసిన ఆంజనేయస్వామి, గణపతి, కాలభైరవ విగ్రహాలకు మంళవారం హనుమాన్ భక్తులు అభిషేకాలు చేసి చందనం వేశారు. ప్రతి మంగళవారం దీపారాధన చేస్తూ హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్నట్లు వారు తెలిపారు. మచ్చర్లయ్య గుట్టపై వెలసిన హనుమాన్ స్వామి కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రఖ్యాతిగాంచడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి దీపారాధన చేస్తున్నట్లు తెలిపారు. హనుమాన్ భక్తులు గిద్దమారి సురేశ్, మోరే రంజిత్, తట్ల రాజశేఖర్, చల్ల నాగరాజు, మహేందర్, వెంకటేశ్, మహేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య



ఎల్కతుర్తి : అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాలపడిన సంఘటన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెరలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దామెరకు చెందిన గీత కార్మికుడు మంద చిన్నమొగిలి (71) రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్థికసాయం

తొర్రూరు : జర్నలిస్టు బోగోజు సురేశ్ ఆర్నెళ్ల క్రితం మృతి చెందగా బాధిత కుటుంబానికి స్థానిక ఎస్సై జగదీష్ మంగళవారం రూ.5 వేల సాయం అందజేశారు. ఏఎస్సై రాంజీ నాయక్, ఏఎస్సై రవీందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ఉన్నారు.

కుంటుపడుతున్న ప్రభుత్వ విద్య

- ఐదు తరగతులకు రెండే గదులు
- చెట్టుకిందే బోధన
- మండల కేంద్రానికి ఈ పాఠశాలే దిక్కు
- ప్రచారాలకే పరిమితమవుతున్న పాలకులు
- ప్రైవేట్ వైపు విద్యార్థుల చూపు..



మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గదులు లేక ఆరుబయట పాఠాలు వింటున్న విద్యార్థులు



ఆత్మకూరు ప్రాథమిక పాఠశాల

ఆత్మకూరు : కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ విద్యను అందిస్తున్నామని ప్రభుత్వం చేసే ప్రచారాలు నూరుశాతం ప్రచారాలుగానే మిగిలిపోతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్లక్ష్యం నీడలో సమస్యలకు కేంద్రంగా మారుతోంది. పట్టణంలోని మజీద్ దగ్గర గల ప్రాథమిక పాఠశాలను గొల్లవాడ ప్రాథమిక పాఠశాల అని కూడా పిలుస్తారు. ఈ పాఠశాలలో కనీస వసతులు లేకపోవడంతో పాటు పాఠాలు బోధించేందుకు, చదువుకునేందుకు తరగతి గదులకే దిక్కులేకుండా పోయింది. పనికిరాని చోట భవంతులు కట్టే సర్కారు ఇక్కడ అవసరమైన చోట అదనపు తరగతి గదులు నిర్మించకపోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ పాఠశాలలో సుమారుగా 100మంది విద్యార్థులు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్నారు. శిథిలావస్థకు చేరుకున్న రెండే గదులు ఉండడంతో చెట్ల కిందే పాఠాలు బోధిస్తున్నారు. ఈ పాఠశాల భవనం 1985లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డిపెప్ పథకంలో నిర్మించారు. వర్షాలు కురిస్తే పాఠశాలకు తాళం వేయాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే పోచమ్మ సెంటర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని ఆ భవనాన్ని కూల్చివేశారు. అందులోని విద్యార్థులను పోచమ్మసెంటర్ పాఠశాలకు తరలించి, ఉపాధ్యాయులకు డిప్యూటేషన్‌లో తీసుకున్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదులను నిర్మించాలని, అంతవరకు అద్దె భవనం తీసుకుని పాఠాలు బోధించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మంత్రులు కొండ సురేఖ, సీతక్క ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయించి పాఠశాలకు పక్కా భవనం నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలియపరుస్తాం



నేను ఈ పాఠశాలలో ఇటీవల విధుల్లో చేరాను. పాఠశాలలో తరగతి గదులు లేకపోవడం వాస్తవమే. దీంతో పాఠాలు బోధించేందకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

-పెండెం రాజు, ప్రధానోపాధ్యాయుడు

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ మేకల స్వప్న అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. అధికారులు నివేదికలతో రావాలని కోరారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుండె బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తున్నందున వారికి సన్మాన, వీడ్కోలు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

డీసీఎంను ఢీకొన్న కారు



శాయంపేట : అతి వేగంతో వచ్చిన కారు డీసీఎంను వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా డీసీఎం డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాఇ. ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల పట్టణానికి చెందిన డీసీఎం డ్రైవర్ సురుగురి రామన్న రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం హనుమకొండ నుంచి పరకాలకు వెళ్తుండుగా కొత్తగట్టు సింగారం స్టేజీ సమీపానికి చేరుకోగానే గీసుకొండ నుంచి కాళేశ్వరం వెళ్తున్న కారు వేగంగా వచ్చి డీసీఎంను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో కారు డ్రైవర్ అనుగుల రంజిత్ రెడ్డి, అతని తండ్రి సాంబరెడ్డి, కూతురు రచనకు తీవ్ర గాయాలు అయ్యాయి. 108 వాహనంలో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. వ్యాను డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. డీసీఎం డ్రైవర్ రామన్న ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ రంజిత్‌రెడ్డి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 1 నుంచి కొత్త చట్టం అమల్లోకి వచ్చినందున బీఎన్ఎస్‌లో అండర్ సెక్షన్ 281, 125(ఏ) మొదటి కేసుగా నమోదయినట్లు ఎస్సై తెలిపారు.

పోస్టర్ తయారీలో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం జయ, ఉపాధ్యాయులు

చెన్నారావుపేట : ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా తెలంగాణ నేషనల్ గ్రీన్ కాప్స్ (ఎన్జీసీ), జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోస్టర్ తయారీ పోటీలో మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని దాక్షాయణి ప్రతిభ కనబర్చిందని ప్రధానోపాధ్యాయురాలు జయ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్ఎం, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. అనంతరం హెచ్ఎం జయ మాట్లాడారు. వరంగల్‌లో పోటీలు నిర్వహించగా దాక్షాయణి తృతీయ స్థానంలో నిలిచిందని చెప్పారు. ఈ క్రమంలో డీఈఓ వాసంతి నుంచి విద్యార్థి దాక్షాయణి, గైడ్ టీచర్ గజవెల్లి సుందర్ ప్రశంసాపత్రంతోపాటు మెమోంటో అందుకున్నట్లు తెలిపారు. పోటీలో విద్యార్థులు కీర్తన, అక్షిత, సాత్విక, శ్రావణి, శ్రీకర్, పునీత్ పాల్గొని సర్టిఫికెట్లు అందుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోశ్‌కుమార్, బాలాజీరావు, ఉదయ్‌కుమార్, మాధవి, మొగిలి, రమాదేవి, సతీశ్ కుమార్, స్వప్న, జాహిద్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్‌లో నిబంధనల ఉల్లంఘన



పుస్తకాలను పరిశీలిస్తున్న సీఆర్పీలు, నాయకులు

నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నేపల్లి గ్రామ శివారులోని న్యూ విజన్ స్కూల్‌లో నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ తెలిపారు. ఎంఈఓకు ఫిర్యాదు చేసిన క్రమంలో స్కూల్‌ను సీఆర్పీలు భరత్, శ్రావణ్ మంగళవారం సందర్శించగా పార్థసారథి, నరేశ్ హాజరై మాట్లాడారు. అధిక ధరకు పుస్తకాలు, యూనిఫారం, టై, బెల్టులు విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలుత నోట్‌బుక్‌లు విక్రయిస్తున్న గదిని సీఆర్పీలు సీజ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు స్టాలిన్, నరేశ్, ప్రశాంత్, వినయ్, శ్రీకాంత్, ప్రసాద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రయాణికులకు బహుమతులు



ప్రయాణికురాలికి బహుమతి అందజేస్తున్న ఆర్టీసీ డీఎం ప్రసూన లక్ష్మి, తదితరులు

నర్సంపేట : ఆర్టీసీ డీలక్స్ బస్‌లో ప్రయాణం చేసి డ్రాలో ఎంపికైన మహిళలకు స్థానిక డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి మంగళవారం బహుమతులు అందజేశారు. తొలుత పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో లక్కీ డ్రా తీశారు. ఈ సందర్భంగా డీఎం ప్రసూన లక్ష్మి మాట్లాడారు. నర్సంపేట నుంచి ఉప్పల్, ఉప్పల్ నుంచి నర్సంపేట ప్రయాణం చేసి బస్ టికెట్ వెనకాల పేరు, సెల్ నంబర్, అడ్రస్ రాసి లక్కీ డ్రా బాక్స్‌లో వేసిన మహిళా ప్రయాణికులకు డ్రా తీసి ముగ్గురిని ఎంపిక చేసినట్లు తెలిపారు. నర్సంపేటకు చెందిన చైతన్యకు బహుమతి అందజేశారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ భవానీ, ఎంఎఫ్ ప్రభాకర్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ నారాయణ, ఈడబ్ల్యూబీ మెంబర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనతో ఉపాధి అవకాశాలు

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజనతో నిరుద్యోగ యువతకు ఉపాధి లభించనుందని బీజేపీ దుగ్గొండి మండల ఇన్‌చార్జ్ బాల్నె జగన్ తెలిపారు. పట్టణంలోని 13వ వార్డులో మంగళవారం ఆ పార్టీ నాయకులు ప్రజలను కలిసి పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడారు. ప్రధాని మోదీ చేతివృత్తులు చేసుకునే వారికి ఉపయోగపడేలా పథకాన్ని రూపొందించారని చెప్పారు. పథకంలో 18 బీసీ కులాలకు అర్హత కల్పించినట్లు తెలిపారు. ఎంపికైన వారికి 15 రోజులు రోజుకు రూ.500 స్టైఫండ్ ఇస్తూ శిక్షణ ఇవ్వడంతోపాటు వృత్తికి సంబంధించిన రూ.15 వేల విలువైన కిట్ అందజేస్తారని చెప్పారు. పథకాన్ని అర్హులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సామల ప్రవీణ్, దామెర ఆకాశ్, కనుక గణేశ్ పాల్గొన్నారు.

కట్ట మరమ్మతు పనులు ప్రారంభించాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



చెరువుకట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : మండల కేంద్రంలో ప్రమాదకరంగా ఉన్న చెరువుకట్టకు మరమ్మతు పనులు వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఆత్మకూరు పెద్దచెరువు కట్ట ప్రమాదకరంగా మారిన విషయాన్ని తెలుసుకున్న ఆయన.. మంగళవారం ఉదయం చెరువుకట్టను పరిశీలించారు. చెరువుకట్ట మొదలు నుంచి చివరివరకు సుమారు 2కిలో మీటర్ల మేర నడుచుకుంటూ పరిశీలించారు. అనేక చోట్ల చెరువుకట్ట కోతకు గురికావడంతో ఆందోళన వ్యక్తం చేశారు. నీటిపారుదలశాఖ ఈఈ సునీత, డీఈ వేణుగోపాల్, ఏఈ జ్యోతిరాణితో చెరువుకట్ట పరిస్థితిపై అక్కడే సమీక్షించారు. రూ.77.40 లక్షలతో గతంలోనే ప్రతిపాదనలు పంపించామని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఫైలు ఉన్నతాధికారుల వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎలాంటి జాప్యం చేయకుండా పనులు ప్రారంభించి వర్షాల ఉధృతి మొదలుకాకముందే పనులు పూర్తిచేయాలన్నారు. చెరువు కట్ట ఎత్తు కూడా పెంచాలని సూచించారు. అలాగే మండలంలోని కటాక్షపూర్ చెరువుతో పాటు పలు చెరువుల్లో అనుమతితో మట్టి తీసినప్పటికీ గుంతలు అలాగే వదిలేసినట్లు తన దృష్టికి వచ్చిందని, మట్టితీసి గుంతలను అలాగే వదిలేసిన వారికి నోటీసులు పంపించి వెంటనే చెరువుల ఉపరితలాన్ని లెవల్ చేయాలన్నారు. కామారం చెరువును కూడా పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంఆర్ఐ రవీందర్, సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, మత్స్యసంఘం చైర్మన్ బయ్య తిరుపతి, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, రాజు, రజనీకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు, బరుపట్ల కిరీటి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఖాజా, సొసైటీ డైరెక్టర్ రేవూరి జయపాల్‌రెడ్డి, యూత్ కార్యదర్శి తనుగుల సందీప్, నాయకులు వెంకటేశ్వర్లు, ఒడ్డెపెల్లి ప్రసాద్, అలువాల రవి పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకుల ధర్నా

- అనుమతి లేని గదుల సీజ్



శ్రీచైతన్య పాఠశాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఎల్కతుర్తి : మండలంలోని ఇందిరానగర్ సమీపంలో గల శ్రీచైతన్య ప్రయివేటు పాఠశాలలో 8,9,10వ తరగతులను ప్రభుత్వ అనుమతి తీసుకోకుండా కొనసాగిస్తున్నారని ఆరోపిస్తూ ఏఐఎస్ఎఫ్ నాయకులు మంగళవారం పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో డీఈఓ ఆదేశాల మేరకు మండల విద్యాధికారి (ఎంఈఓ) రవీందర్ పాఠశాలకు చేరుకుని అనుమతి లేకుండా నడుపుతున్న 8,9,10 తరగతి క్లాస్ రూమ్‌లకు సీజ్ వేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బాషబోయిన సంతోష్, కార్యదర్శి ఉట్కూరి ప్రణీత్‌గౌడ్ మాట్లాడారు. శ్రీచైతన్య ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా 8,9,10వ తరగతి క్లాస్‌లను కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. అనుమతి లేని పాఠశాల్లో చదువుకుని బయటకు వెళ్లిన విద్యార్థులు ఉన్నత చదువులు, ఏదైనా ఉద్యోగం వచ్చిన సందర్భంలో పర్మిషన్ లేని పాఠశాలలో చదువుకున్నందుకు వారి జీవితాలు బలవుతాయని అన్నారు. అలాగే పాఠ్యపుస్తకాలు, షూ, టై, బెల్టులు, యూనిఫాం, స్టేషనరీని 10కిలో మీటర్ల దూరంలో వారి ఎంప్లాయ్‌లతో విక్రయాలు జరిపించి సొమ్ము చేసుకుంటున్నారని మండిపడ్డారు. పాఠశాలకు కనీసం ఫైర్, పొల్యూషన్, క్వాలిఫై టీచర్స్, బస్సుల ఫిట్నెస్ కూడా లేదన్నారు. కార్పొరేట్ పాఠశాలలపై ఉన్నత అధికారులు దృష్టి సారించడంలో పూర్తిగా విఫలం అవుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మనోజ్, నరేష్, సందీప్, కల్యాణ్, వినయ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మైలారం గుట్టల్లో మొరం దొంగలు



మైలారం గుట్టలో మొరం తవ్వుతున్న జేసీబీ

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామ శివారులో గల ప్రభుత్వ గుట్టల నుంచి అనుమతులు లేకుండా కొందరు అక్రమార్కులు మొరం తవ్వకాలు చేపడుతున్నారని గ్రామ మాజీ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్ ఆరోపించారు. రోడ్డు పనులకు, ఇంటి నిర్మాణాలకు మొరం దొరకపోవడంతో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు అనుమతులు పొందకుండా కొన్ని రోజులుగా 200 మిషన్‌తో గుట్టలపై అక్రమ తవ్వకాలు జరుపుతూ ట్రిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మొరాన్ని తరలిస్తున్నారని తెలిపారు. అధికారులు మామూళ్ల మత్తులో అటువైపు కన్నెత్తి చూడడంలేదని ఆరోపించారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించాలని కోరారు.

రైతుల అభిప్రాయాలు ప్రభుత్వానికి నివేదిస్తాం

- జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర్‌రావు
- పలు మండలాల్లో మహాజన సభలు..
- సూచనలు ఇచ్చిన రైతులు



ధర్మసాగర్ : మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర్‌రావు

ధర్మసాగర్ : రైతు భరోసాపై స్పష్టమైన నిర్ణయం తీసుకునేందుకు రైతుల నుంచి అభిప్రాయాలు, సూచనలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావించిందని, రైతుల అభిప్రాయాలు, సూచనలు ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రైతు భరోసా పథకంపై అభిప్రాయ సేకరణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. పంటలు సాగు చేసే భూములను గుర్తించి వారికే రైతు భరోసా ఇవ్వాలని రైతులు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. పంటసాగు చేసే 5 నుంచి 10 ఎకరాల భూములను గుర్తించి ఆ రైతులకే రైతుభరోసా ఇవ్వాలని సూచించారు. కుటుంబంలో ఎంత మందికి పట్టా పాసుబుక్కులు కలిగి ఉన్నా అందరికీ రైతు భరోసా ఇవ్వాలని కోరారు. అదే విధంగా విత్తనాలకు, ఎరువులకు, పనిముట్లకు సబ్సిడీ ఇవ్వాలని కోరారు. రైతులు తెలిపిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదకుమార్, డైరెక్టర్‌లు బొడ్డు లెనిన్, ఎంపీటీసీలు రొండి రాజు, వనమాల, బొడ్డు శోభ, పీఏసీఎస్ సీఈఓ రాజిరెడ్డి, ఏఓ పద్మ, బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

దామెరలో..



దామెర : మాట్లాడుతున్న చైర్మన్ రాజు

దామెర : రైతు భరోసా పథకంపై రైతుల నుంచి స్వీకరించిన అభిప్రయాలను, సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తామని పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు అన్నారు. మండలంలోని ఊరుగొండలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో మంగళవారం మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున రైతులు హాజరై రైతు భరోసా పథకంపై పలు సూచనలు చేశారు. అనంతరం చైర్మన్ రాజు మాట్లాడుతూ.. రైతు భరోసా పథకం అమలుపై ప్రతీ రైతు తమ అభిప్రాయాలను తెలియజేయాని సూచించారు. పీఏసీఎస్‌లను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందించే విధంగా కృషి చేయాలని అన్నారు. ఆరుగాలం కష్టపడి పండిస్తున్న పంటలకు మద్దతు ధర కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి సోమశేఖర్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజస్వామి, డైరెక్టర్లు సంతోశ్, శ్రీనివాస్, అనిల్, బాబు, స్వామి, సీఈఓ శ్రీనివాస్, స్థానిక రైతులు, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్త సెక్షన్ కింద కేసు నమోదు

గూడూరు: కొత్త నేర చట్టాలు మూడు అమల్లోకి వచ్చి రెండు రోజులయింది. అందులో భాగంగా మంగళవారం గూడూరు పోలీసు స్టేషన్‌లో బీఎన్ఎస్ కింద మొదటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్. నగేష్ తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని తేజావత్‌రాంసింగ్‌తండా శివారు నల్లబోడుతండాకు చెందిన జర్పుల సోమ (38) అదే గ్రామానికి చెందిన భూక్య శ్రీనివాస్ వద్ద కొంత అప్పు తీసుకొన్నాడు. అప్పు తీర్చమని సోమను శ్రీనివాస్ ఇబ్బందులకు గురి చేశాడు. అవమానంతో భూక్య సోమ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, కారకులను శిక్షించాలంటూ తండావాసులు మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న ఎస్సై నగేష్ చేరుకొని జరిగిన సంఘటన ఫిర్యాదు మేరకు కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చాడు. దీంతో మంగళవారం మృతుడి భార్య సరోజ ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.